## ఎంపీ వద్దిరాజును కలిసిన డీవైఎఫ్ఐ నాయకులు



**ఖమ్మం,మే 29(నినాదం ):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలు వెంటనే అమలుపర్చాలని, మాదకద్రవ్యాలను, బెట్టింగ్ యాప్స్ పూర్తిగా నిషేధించాలని,దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడుదాం, మతోన్మాదాన్ని వ్యతిరేకిద్దామంటూ యువజన సమాఖ్య ఖమ్మం జిల్లా శాఖ "చైతన్య సైకిల్ యాత్ర"నిర్వహిస్తున్నది.ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, ఉపాధ్యక్షుడు శీలం వీరబాబు, నాయకులు నరేష్,సాయి,ముత్తారావు,రమేష్, నాగరాజు,శ్రీను తదితరులు ఎంపీ రవిచంద్రను ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా కలిసి కొద్దిసేపు ఇష్టాగోష్టి జరిపారు.

## 31న చలో హైదరాబాద్

**- రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయండి**

**-జర్నలిస్టులకు ఆకుతోట ఆదినారాయణ.. చిర్రా రవి పిలుపు**



**ఖమ్మం, మే29(నినాదం):** ఈ నెల 31న హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్ లో జరిగే టి యు డబ్ల్యూ జే (టి జే ఎఫ్ ) 25 ఏళ్ల రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి జే ఎఫ్ ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు పిలుపునిచ్చారు. టియుడబ్ల్యూ జే (టి జే ఎఫ్ ) జిల్లా ముఖ్య నాయకుల సమావేశం గురువారం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సందర్భంగా ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జర్నలిస్టుల కృషి మరువలేని దాన్ని, జర్నలిస్ట్ యూనియన్ గా ఆవిర్భవించి 25 ఏళ్ళు పూర్తవుతున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలను హైదరాబాద్ లో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టు లో పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ నిరంతరం పనిచేస్తుందని, అందులో భాగంగా పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి జే ఎఫ్ ) జాతీయ నాయకులు వెన్నబోయిన సాంబశివరావు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు వనం నాగయ్య, మందుల ఉపేందర్, శ్రీధర్ శర్మ, నాగయ్య ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, కార్యదర్శి కర్రిషా అశోక్, మీడియా ఇంచార్జ్ తిరుపతిరావు,నాయకులు పోన్నె బోయిన పానకాలరావు, ఉల్లోజు రమేష్, నల్లమోతు శ్రీనివాస్, మోహన్ ,సాయి, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల..



**దమ్మపేట, మే 29(నినాదం న్యూస్):** మండల కేంద్రంలోని నిర్మించిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా రాజకీయంలో ఉన్నాను అంటే అది ఎన్టీఆర్ ఇచ్చిన శక్తి అని, ఆ శక్తిని నిలుపుకోవడానికి ఎన్ని అడ్డంకులు వచ్చినా మిమ్మల్ని చూసుకొనే రాజకీయల్లో ముందుకు పోతున్నానని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్టీఆర్ నేటి తరానికి ఆదర్శప్రాయుడని అయన కొనియాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చిన మహా నేత ఎన్టీఆర్ అని తుమ్మల వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలను ఎన్టీఆర్ రూపకల్పన చేయగా దేశ వ్యాప్తంగా మార్గదర్శకంగా మారాయన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వరరావు, నియోజకవర్గం నాయకులు కట్రం స్వామి దొర, మండల ముఖ్య నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# పేద విద్యార్థుల పట్ల గురుకుల సెక్రెటరీ వైఖరి దుర్మార్గం



**ఖమ్మం, మే 29(నినాదం):** పేద, దళిత విద్యార్థులపై వివక్ష చూపుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సాంఘీక సంక్షేమ గురుకుల సెక్రెటరీ అలుగు వర్షిణీ ని వెంటనే గురుకుల సెక్రెటరీ పదవినుండి తొలగించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల రాష్ట్ర సెక్రటరీ అలుగు వర్షిణి గురుకుల విద్యార్థులుపై అనుచిత వాక్యాలను నిరసిస్తూ పిడిఎస్యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అలుగు వర్షిణి దిష్టి బొమ్మను గురువారం మున్సిపాలిటీ సెంటర్ నందు దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ లు మాట్లాడుతూ పేదవిద్యార్థులను బాత్రూంలు క్లీన్ చేసుకోవాలని, వంట చేసుకోవాలని, ఊడ్చుకొని తూడ్చుకోవాలని ఒక ఐఏఎస్ అధికారి గురుకుల సెక్రెటరీ అలుగు వర్షిణి వ్యాఖ్యలను పిడిఎస్యు కమిటీ త్రీవరంగా ఖండించింది. ఎవరైనా పిల్లల పక్షాన తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారి పిల్లలకు షోకాజ్ నోటీస్లు ఇస్తారా.,? 40 సంవత్సరాల సోషల్ వెల్ఫేర్ గురుకుల చరిత్రలో ఇంతటి మానవత్వం లేని సెక్రటరీని ఎక్కడ కూడా చూడలేదని దుయ్యబట్టారు. దళిత విద్యార్థులకు గతంలో కంటే మెరుగైన విద్యను అందించాలని ఐఏఎస్ అధికారిగా గురుకుల సెక్రటరీని నియమిస్తే ఇంత వివక్షత చూపుతారా అని ప్రశ్నించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కస్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, దళిత విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుకునే స్తోమత లేకనే మయనీయులైన మేధావులు అలోచనచేసి గురుకులాలను ఏర్పాటుచేశారని కొనియాడారు. గురుకులాల్లో ప్రైవేట్, కార్పోరేట్ కు ధీటుగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. గురుకులాల్లో సెక్రెటరీ గా పనిచేసిన ఎవ్వరూ కూడా విద్యార్థులను విద్యకు దూరంచేసే ఇలాంటి దారుణ సంఘటనలకు పాల్పడలేదన్నారు. గురుకుల సెక్రెటరీగా అలుగు వర్షిణీ బాధ్యతలు చేపట్టిన దగ్గర నుండి గురుకులాలను బ్రస్టుపట్టించే విధంగా వివాస్పద నిర్ణయాలు తీసుకోవడం, వ్యాఖ్యలు చేయడం ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నాయన్నారు. అందులో విద్యార్థులు లేరనే సాకుతో రాష్ట్ర వ్యాప్తంగా 12 గురుకుల ఇంటర్ కళాశాలలను తొలగించి సుమారు వెయ్యిమంది విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు. గురుకులాల్లో ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న ల్యాబ్ అటెండర్స్ కు ఏప్రిల్, మే నెలల జీతాలు ఇవ్వలేదు, ఎలక్ట్రీషన్లకు జీతాలు ఇవ్వకుండానే నిర్లక్ష్యంగా తొలగించారు. తెలంగాణ వ్యాప్తంగా పనిచేస్తున్న ఏసిటీలకు ఏప్రిల్ జీతాలు ఇవ్వకుండా తొలగించారు. పాఠశాలలో పనిచేస్తున్న స్వీపింగ్, శానిటేషన్ వర్కర్స్ను బిల్లులు ఇవ్వకుండానే తొలగించారు. తాత్కాలిక, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఏప్రిల్ నెల జీతాలు ఇవ్వలేదు. గత నాలుగు నెలలుగా కాంట్రాక్టర్లకు(స్వీపింగ్, చికెన్, మటన్, కూరగాయలు, పండ్లు, క్యాటరింగ్, కిరాణం) బిల్లులు ఇవ్వలేదు. గురుకుల విద్యార్థినులకు గత 3 నెలలుగా కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అదేవిధంగా మహిళల పాఠశాలలు, ఎక్కడా లేని విధంగా కళాశాలలో పురుష సిబ్బంది ఉండొద్దని ఆదర్స్ జారీచేయడం కూడా వివాదస్పద నిర్ణయాలే అని విమర్శించారు. నిజామాబాద్ జిల్లా బిక్కనూరు పాఠశాలలో ఎలక్ట్రీషన్ ను తొలగించడం వలన కరెంట్ పని తెలియని అటెండర్ విద్యుత్షాక్ కు గురై మరణించడం జరిగిందన్నారు. దీనికి గురుకుల సెక్రెటరీ బాధ్యత వహించాలన్నారు. గురుకుల సెక్రెటరీ తీసుకున్న వివాదస్పద నిర్ణయాలే వీటన్నిటికి కారణమని గురుకుల పేరెంట్స్ కమిటీలు, గురుకుల యూనియన్లు కూడా ఆరోపిస్తున్నాయని వివరించారు. వెంటనే గురుకుల సెక్రెటరీ ని తొలగించి గతంలో మాదిరిగానే గురుకుల విద్యాలయాలను కొనసాగించాలని, తొలగించిన నిరుద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా నాయకులు యశ్వంత్, సందీప్, ప్రాణవ్, ప్రసాద్, పేరాల వెంకటేష్, జీవన్, మాజీ రాష్ట్ర నాయకులు మురళి, జిల్లా నాయకులు తిమ్మిడి రఘు, నసీర్, అనిల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండా దంపతుల పెళ్లిరోజు వేడుకలు

**-పారిశుద్ధ కార్మికులకు బట్టలు పంపిణీ**
**-పేదలకు కుట్టు మిషన్లు పంపిణీ**

**-మహా అన్నదానం కార్యాక్రమం**



**పోచమ్మ మైదాన్ :** కొండా దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వరంగల్ చౌరస్తాలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజు ఆధ్వర్యంలో గురువారం వరంగల్ చౌరస్తాలో భారీ కేక్ కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు .వరంగల్ నగరపాలక సంస్థ పారిశుద్ధ కార్మికులకు సుమారు 1000 మందికి బట్టలు పంపిణీ దాంతో పాటు పేదలకు కుట్టు మిషిన్లు పంపిణీ చేశారు . అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని గోపాల నవీన్ రాజు ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా దంపతుల నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు . వరంగల్ అభివృద్ధిపై కేసీఆర్ ప్రభుత్వంలో మాటలే విన్నామని . ఇప్పుడు తమ ప్రభుత్వం చేతల్లో చేసి చూపుతుందని. మాది చేతల ప్రభుత్వమని ఉద్ఘాటించారు . సీఎంను వరంగల్ అభివృద్ధి కొరకు కొండా దంపతులు అడిగిన వెంటనే వరంగల్కు 4వేల పైచిలుకు కోట్ల రూపాయల నిధులు విడుదల చేశారని గుర్తుచేశారు. వరంగల్ను రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి కొండా దంపతుల నేతృత్వంలో చేస్తారని తెలిపారు .ఈ కార్యక్ర మంలో టిపిసిసి కార్యదర్శి మీసాల ప్రకాష్ , కొత్తపల్లి శ్రీనివాస్ , జారతి రమేష్ ,కత్తెర శాల వేణుగోపాల్ ,మడిపల్లి కృష్ణ , వాసిమ్ , భాషపాక సదానందం , తోట వేణు , కురిమిళ్ళ సంపత్ , మబ్బు ప్రవీణ్ ,కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు జారతి శ్రీనివాస్ , కత్తెరసాల శ్రీధర్ , కోడం శివకృష్ణ , కార్పొరేటర్లు బస్వరాజ్ కుమార్ స్వామి ,యెలగం లీలావతి సత్య నారాయణ ,గుండు చందనా పూర్ణచందర్ , ముష్కమల్ల అరుణ సుధాకర్ , భోగి సువర్ణ సురేష్ ,వాస్కుల బాబు , బాల్నే సురేష్ , మాజీ కార్పొరేటర్లు కెడల పద్మ , బాసాని శ్రీనివాస్ , గడ్డం యూగేందర్ , యూకుబ్ పాషా , పూర్ణేందర్ రెడ్డీ , రాం పెల్లి శ్రీ నివాసా చారి , పగడాల సతీష్ , 19 డివిజన్ అధ్యక్షుడు రాజేష్ ,మహిళా నాయకురాలు సునీత ధనలక్ష్మి రాజమణి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు మహిళా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలను నిర్వహించాలి

**-అన్ని శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి**

**-ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలి**

**-కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**పాలకుర్తి :**తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఏసీపీ పండరి చేతన్ నితిన్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 2న జరుపుకొనే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు సంయుక్తంగా పనిచేయాల్సిందిగా సూచించారు.తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణలో భాగంగా.. కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, చెత్తాచెదారం లేకుండా పిచ్చి మొక్కలను తొలగించాలని, వివిధ శాఖల తరపున స్టాల్స్ లను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ (నిర్వహణ నియమాలు)ను అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ, డీపీఆర్ఓ సంయుక్తంగా కలిసి తయారు చేయాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు తగు ఏర్పాట్లను ముందస్తు జాగ్రత్తలతో నిర్వహించాలని స్పష్టం చేశారు.అగ్నిమాపక ఇంజన్ లను సిద్ధంగా ఉంచాలని, తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, అమరవీరుల స్థూపం, స్టేజ్, పూలమొక్కల ఏర్పాటు, అలాగే వాటి అలంకరణ, తివాచీలను, బ్యారికేడ్ లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు, గౌరవ వందనం, పోలీసు బ్యాండ్ వంటి ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అదే విధంగా సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అందులో భాగంగా రాజీవ్ యువ వికాసం పథకం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, బ్యాంకు లింకేజ్ కింద అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. వాటికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా, మండల స్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని తెలిపారు.ఈ సన్నాహక సమావేశంలో జనగామ ఆర్డీఓ గోపీరాం, కలెక్టరేట్ ఏవో మన్సూర్, జిల్లా విద్యా శాఖ అధికారి భోజన్న, జిల్లా పౌరసరఫరాల అధికారిణి సరస్వతి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ వసంత, డీపీఓ స్వరూప, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీధర్ రావు, డీవైఎస్ఓ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్ హుస్సేన్, పోలీసు అధికారులు, పాల్గొన్నారు.

## అడ్డదారుల్లో బంగ్లా శరణార్థులు

**-ఆధార్ కార్డులు సహా సకల సౌకర్యాలు**

**-నేరాలుచేస్తూ ఇక్కడే ఉండేలా నైజీరియన్లు**

**-హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆనంద్**

**హైదరాబాద్ :** హైదరాబాదులో నేరాలు చేస్తున్న నైజేరియన్స్ను డిపోర్ట్ చేస్తున్నట్లు- హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. డిపోర్టు చేసిన తర్వాత కూడా చాలా మంది నకిలీ పాస్పోర్ట్ లతో ఇండియాలోకి ప్రవేశిస్తున్నారని, అలాంటి వాళ్లను కూడా అరెస్ట్ చేస్తున్నట్లు- వెల్లడించారు. హైదరాబాద్ లో జోనల్ సైబర్ సెల్స్ ను ప్రారంభించిన కార్యక్రమంలో ప్రసంగించారు. నైజీరియన్లను వాళ్ళ దేశానికి డిపోర్ట్ చేస్తారని భయంతో ఏదో ఒక కేసులో ఇన్వాల్వ్ అవుతున్నారని సంచలన విషయాన్ని తెలిపారు. చివరికి 498 కేసులో అయిన ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టించు కుంటున్నారని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. నైజీరియన్స్ పై కేసు నమోదు అయితే చట్టపరంగా డిపోర్ట్ చేయలేమని స్పష్టం చేశారు. వారిపై కేసు ట్రయల్ పూర్తి చేసి క్లోజ్ అయ్యే వరకు డిపోర్టు చేయలేమని వివరించారు. బంగ్లాదేశ్ కి చెందిన పౌరులు కూడా శరణార్థులుగా ఇక్కడికి వస్తున్నారని.. ఈ వ్యవహారాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు- తెలిపారు. అడ్డుదారుల్లో ఇక్కడ ఆధార్ పొందుతున్నట్లు- గుర్తించినట్లు- చెప్పారు. ఈ వ్యవహారంలో సాంకేతిక సమస్యలు ఉన్నాయన్నారు. ఉగ్రవాద లింక్స్ ఉన్న సమీర్ కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తుందని సీపీ స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఎన్ఐఏ నాలుగు చోట్ల సోదాలు చేసిందని.. ఎన్ఐఏ విచారణ, సోదాలకు హైదరాబాద్ పోలీసుల సహకారం అడిగితే చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ లో సమీర్ తో ఇంకా ఎవరెవరికి లింక్స్ ఉన్నాయనే అంశాన్ని ఎన్ఐఏ దర్యాప్తులో బయటికి వస్తాయని తెలిపారు. అలాగే.. ఫోన్ టాపింగ్ కేసులో విచారణ కొనసాగుతుందని సీవీ ఆనంద్ వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని..ప్రస్తుతానికి ఉన్న చర్యలు అన్ని హోల్డింగ్ లోకి వెళ్లిపోతాయన్నారు. కొత్త పాస్పోర్టు జారీ పక్రియ మొత్తం కూడా విదేశీ వ్యవహారాల శాఖ చూసుకుంటుందని.. పాస్పోర్టు ఎప్పుడు ఎలా జారీ చేస్తారనే విషయాన్ని తాము కూడా తెలుసుకోవాలన్నారు. ఇంటర్పోల్, డిస్పోర్ట్ ఇతర ఇతర చర్యలు అన్ని కూడా హోల్డింగ్ లోకి పోతాయని వెల్లడించారు.

## కెసిఆర్ ఫ్యామిలీ డ్రామాలు అదుర్స్

**-కవిత లేఖ..వ్యాఖ్యలతో మరింత స్పష్టం: ఆది శ్రీనివాస్**

**కరీంనగర్ :** బిఆర్ఎస్లో రాజకీయ డ్రామాలు పరాకాష్టకు చేరాయని, డాడీ డాటర్ లేఖపై ప్రజల్లో చర్చ జరుగుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కవిత లేఖతో కేసీఆర్ ఫామ్ హౌస్కే పరిమితం అయ్యారని ప్రజలు గ్రహించారన్నారు. అలాగే తాజాగా కవిత వ్యాఖ్యలు చూస్తుంటే ఫ్యామిలీ గొడవులు తారాస్థాయికి చేరాయని అర్థం అవుతోందన్నారు. తెలంగాణ ప్రజలను వంచింది, ఎందరో ఉద్యమకారులను అణచివేసి అధికారం అనుభవించారని అన్నారు. అధికారం కోసం రాష్ట్రం ఏమైనా ఫర్వాలేదని అప్పులు చేసిన ఘనమైన కుటుంబం వారిదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం విచారణ సమయంలో ఇలాంటి డ్రామాలను ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరును ప్రజలు మెచ్చుకుంటున్నారని తెలిపారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్పై చేసిన ఆరోపణలు నిజమే అని కవిత లేఖతో స్పష్టమైందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## ప్రతికూల వాతావరణం

**-ప్రధాని సిక్కిం పర్యటన రద్దు**

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిక్కిం పర్యటన రద్దయింది. వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయన సిక్కిం పర్యటన రద్దు అయింది. అయితే సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్గా తన సందేశం వినిపించారు. రూ.750 కోట్ల ప్రాజెక్టులను ఆయన ప్రారంభించనున్నారు. కాగా గురువారం నుంచి మూడు రోజుల పాటు- ప్రధాని మోదీ ఐదు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. 6 బహిరంగ సభలతో పాటు- రోడ్ షోలు నిర్వహించనున్నారు. సిక్కిం, పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ లో ప్రధాని పర్యటించనున్నారు. వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై తన సభల్లో ప్రధాని మోదీ ఫోకస్ చేయనున్నారు. ఈ క్రమంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఈరోజు మోదీ సిక్కిం పర్యటన రద్దయింది. తర్వాత ఆయన రాష్ట్రాల పర్యటన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## లేఖలు, లీకులు కాదు..వాస్తవాలు చెప్పండి

**-కవితకు ఎంపి చామల సూటి ప్రశ్న**

**న్యూఢిల్లీ:** ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ గురించి వాస్తవాలు చెప్పాలని అనుకుంటే లేఖలు, లీకులు కాదని.. అందుకు అవసరమైన ఆధారాలు కవిత బయటపెట్టాలని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. కేసీఆర్ హయాంలో పదేళ్లలో జరిగిన అవినీతిపై కవిత దర్యాప్తు కోరాలని అన్నారు. గురువారం ఢిల్లీలో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. దెయ్యాలు ఎవరో కవిత బయటపెట్టాలని.. దర్యాప్తు కోరాలని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి రాజకీయాలు చేస్తున్నాయని తమ నేతలు మొదటి నుంచి చెబుతునే ఉన్నారని గుర్తుచేశారు. ఈరోజు కవిత వ్యాఖ్యలు దాన్ని నిజం చేశాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్కి కవిత అవసరం లేదని.. తమకు సమర్థమైన నాయకత్వం ఉందని.. తమ పార్టీలోకి కొత్త వాళ్లు అవసరం లేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.